
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శనివారం 14 సెప్టెంబరు 2024



'అసైన్డ్' లెక్క.. ఇక పక్కా..

నిగ్గు తేల్చనున్న రెవెన్యూ శాఖ

- ఎల్ఆర్ఎస్ పరిశీలనలో భాగంగా గుర్తింపునకు కసరత్తు
- మూడుశాఖల భాగస్వామ్యంతో ప్రక్రియ
- ప్రభుత్వ చర్యలతో అక్రమార్కులు, స్థల యజమానుల్లో కలవరం
- ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున భూముల అన్యాక్రాంతం
- విచ్చలవిడిగా వెంచర్లు వేసి ప్లాట్ల అమ్మకాలు

హనుమకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో.. ప్రభుత్వం అసైన్డ్ భూముల గుర్తింపును నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఎక్కడ అసైన్డ్ భూములను ప్లాట్లు చేశారు? ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో అసైన్డ్ భూములు ఏ మేరకు ఉన్నాయి? అందులో ఎన్ని అన్యాక్రాంతమయ్యాయి? అనే అంశాలపై ఓ స్పష్టత రానుంది. ఇదే సమయంలో అసైన్డ్ భూముల లెక్క ఇక పక్కాగా నమోదు కానుంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయి ? అవి ఎవరెవరి చేతిలో ఉన్నాయి ? ఎన్నీ పరాధీనం అయ్యాయి. అనే లెక్కలు లేవు. గత ప్రభుత్వాలు ఈ దిశగా పెద్ద ప్రయత్నాలు చేయలేదు. అసలు అసైన్డ్ భూములపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించినట్టు కూడా లేదన్న ఆరోపణలున్నాయి. ధరణి పోర్టల్ అందుబాటులో వచ్చిన తర్వాత కబ్జాదారులు రూ.కోట్లాది విలువైన అసైన్డ్ భూములను అప్పణంగా కాజేసి దర్జాగా అందులో వెంచర్లు చేసి విచ్చల విడిగా అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న ప్లాట్ల యజమానుల్లో చాలా మందివి ఇలాంటివే. ఒక సారి అవి రెగ్యులరైజ్ అయితే ఇక శాశ్వతంగా వారి సొంతమైనట్టే. ఉమ్మడి జిల్లాలో లక్షా 47వేలకు పైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మున్సిపాలిటీల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోనే 90వేల దరఖాస్తులు అందాయి. సుమారు 46వేల ఎకరాల మేరకు అసైన్డ్ భూములున్నట్టు అంచనా. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ముగ్గురు అధికారుల చొప్పున 12బృందాలను నియమించారు. 2020 ఆగస్టు 26 తేదీలోపు రిజిస్ట్రేషన్ అయి ఎల్ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికే ఇది వరిస్తుంది. ఆ తేదీ తర్వాత అనధికార లే అవుట్లకు, ప్లాట్లకు అనుమతులు జారీ కావు.

అసైన్డ్ భూములపై రాష్ట్ర సర్కారు దృష్టి..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేప్పుడు అసైన్డ్ భూములపై ప్రధానంగా దృష్టిసారించాలని రేవంత్ సర్కారు కలెక్టర్లను ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల్లో ఎల్ఆర్ఎస్ ఆమోదం కోసం క్షేత్రస్థాయిలో జరిపే పరిశీలనలో మున్సిపల్ అధికారులకు తోడు రెవెన్యూ శాఖ, నీటి పారుదల శాఖలకు భాగస్వామ్యం కల్పించింది. గతంలో ఒక్క మున్సిపాలిటీ అధికారులు, లేదంటే వారి కింది స్థాయి సిబ్బంది మాత్రమే పరిశీలన జరిపేవారు. అయితే ఆ స్థలాలు అసైన్డ్ భూములా? కాదా? అనేది తమకు అందుబాటులో ఉన్న రికార్డు ప్రకారం మాత్రమే ధ్రువీకరించుకునే వారు. మున్సిపాలిటీ వద్ద ఉన్న అరకొర రికార్డుల వల్ల కొన్ని సార్లు అసైన్డ్ స్థలాలు సైతం రెగ్యులరైజ్ అయిన ఉదంతాలున్నాయి. దీనికి తోడు కొందరు మున్సిపల్ అధికారులు, కింది స్థాయి సిబ్బంది క్షేత్ర పరిశీలనలో అవి అసైన్డ్ భూములు అని తెలినా ముడుపులకు ఆశపడి రెగ్యులర్ చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. వీటన్నిటి దృష్టిలో పెట్టుకొని రాష్ట ప్రభుత్వం ఈ సారి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత స్థాయి పరిశీలనలో మున్సిపల్ శాఖతో పాటు రెవెన్యూ, నీటిపారుదల శాఖలను కూడా భాగస్వాములను చేస్తోంది.

ఇక గుర్తింపు తేలిక

గతంలో మున్సిపాలిటీల్లోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్లాట్లను పరిశీలించేవారు. కొత్త ఆదేశాల మేరకు ఇప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్‌తో పాటు నీటి పారుదల శాఖ ఏఈ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (ఆర్ఐ), ముగ్గురు కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. ఇది ప్రభుత్వ అసైన్డ్ భూమా? ప్రైవేటు భూమా? ఇతర వివాదాల భూమా? అనేది రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గుర్తిస్తారు. బఫర్‌జోన్ నిబంధన మేరకు చెరువు, కుంటలు, వాగులు, నాలాల పక్క నుంచి ఎంత దూరంలో ఉంది అనుమతి ఇవ్వవచ్చా లేదా అనేది నీటి పారుదల శాఖ ఏఈ పర్యవేక్షిస్తారు. ఆ స్థలం నివాస ప్రాంతం (రెసిడెన్షియల్ ఏరియా), వాణిజ్య ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం ఇలా ఏ జోన్‌లో వస్తుంది, జత చేసిన పత్రాలు సరైనవో కావో అనేది పట్టణ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్ గుర్తిస్తారు. తద్వారా అసైన్డ్ భూమిని గుర్తించడం తేలిక కానుంది. వీరు ముగ్గురు ఆమోదించాకే ఎల్1 లాగిన్ నుంచి పట్టణ ప్రణాళిక విభాగం అధికారి (ఎల్2 లాగిన్)కు దరఖాస్తును పంపిస్తారు. అక్కడి నుంచి ఎల్ 3 లాగిన్ పర్యవేక్షించే మున్సిపల్ కమిషనర్‌కు వెళుతుంది. రుసుం చెల్లించాక కమిషనర్ ఆమోదంతో ఎల్ఆర్ఎస్ పత్రం జారీ చేస్తారు. పెద్ద లే అవుట్‌ల క్రమబద్ధీకరణ రికార్డులను ఎల్ 4 దశలో భాగంగా కలెక్టర్ల పరిశీలనకు పంపాల్సి ఉంటుంది.

ఎన్‌వోసీల కోసం!

జీవనోపాధి కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో ఎక్కడ పడితే అక్కడ ప్లాట్లు వెలిశాయి. 1956 కంటే ముందు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములకు ఎన్‌వోసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)లు జారీ అయ్యాయి. దాన్ని అవకాశంగా మలుచుకొని కొందరు ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టారు. అదే అదనుగా కొందరు నకిలీ ఎన్‌వోసీల సృష్టించి అమ్మడానికి వీల్లేని భూములను అన్యాక్రాంతం చేశారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో జత చేసిన ఎన్‌వోసీలు ఏవీ నకిలీవో గుర్తించం కష్టంగా మారింది. ఫలితంగా చాలా దరఖాస్తు లకు మోక్షం లభించడం లేదు. కొత్త మార్గదర్శకాలతో ప్రక్రియలో వేగం పెరుగనున్నదని భావిస్తున్నారు.

అక్రమార్కుల్లో గుబులు..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలనలో ప్రధానంగా అసైన్డ్ భూములపై దృష్టి పెట్టనుండడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది. ఆ స్థలాల్లో ఇళ్ల ప్లాట్లు కొన్నవారు సైతం కలవర పడుతున్నారు. గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేదల నుంచి అసైన్డ్ భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎడాపెడా వెంచర్లు చేసి విక్రయించారు. ఇందులో ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నవారు క్షేత్రస్థాయి పరిశీలనలో అవి అసైన్డ్ భూములని తేలితే ఎక్కడ తమను నిలదీస్తారోనన్న భయం రియల్ ఎస్టేట్ వ్యాపారులను వెంటాడుతోంది. ఇప్పటికే చాలా మంది తమ ఇంటి స్థలం ఎలాంటి, వివాదంలో చిక్కుకొని ఉందా? లేదా? అనేది తమదైన మార్గంలో ఆరా తీస్తున్నారు.



జఫర్‌గడ్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జఫర్‌గడ్‌లో ప్రజలతో ముఖాముఖి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గడ్, సెప్టెంబరు 13 : వెనుకబడిన జఫర్‌గడ్‌ను అన్ని విధాల అభివృద్ధి చెందేలా ఆదర్శ వంతంగా తీర్చిదిద్దుతానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జఫర్‌గడ్‌లో శుక్రవారం ఎమ్మెల్యే శ్రీహరి ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, నాయకులు ఆలయ అభివృద్ధితో పాటు గ్రామంలో నెలకొన్న ఆయా సమస్యలపై కడియంకు వివరిస్తూ విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రజల సహకారం, దేవుని ఆశీర్వాదంతో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రధానంగా ఎంతో ప్రాశస్త్యం పొందిన శ్రీవేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు అలాగే ప్రజలు, వ్యాపారస్తులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా జఫర్‌గడ్ నుంచి తరలించబడిన బ్యాంకు స్థానంలో.. కొత్తగా బ్యాంకు ఆఫ్ బరోడా శాఖను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఆ బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు, త్వరలోనే బ్యాంకు ఏర్పాటవుతుందన్నారు. అలాగే గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వాన్నస్థితిలో ఉన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంతో పాటు రూ. 1 కోటి నిధులచే వివిధ వార్డుల్లో సీసీ రోడ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. నిర్మాణ స్థలాలు ఉన్న పద్మశాలి, ఇతర కుల సంఘాలకు కమ్యూనిటీ భవనాలను, పేదలందరికీ ఇందిరమ్మ పథకం కింద పక్కా ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. జఫర్‌గడ్ చెరువును ఆన్‌లైన్ రిజర్వాయర్‌గా అభివృద్ధి పరిచి, నష్కల్ నుంచి దంసా చెరువు మీదుగా పాలకుర్తి వరకు వెళ్లే కాలువల నిర్మాణాలను పూర్తి చేసి.. జఫర్‌గడ్‌ను వరంగల్ జిల్లాలో కలపాలన్న ఈ ప్రాంత ప్రజల డిమాండ్‌ను తాను స్వాగతిస్తున్నానన్నారు. అయితే కొత్త జిల్లాల ఏర్పాటులో మార్పులు చేర్పులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వెంటనే జఫర్‌గడ్ మండలాన్ని వరంగల్ లేదా హనుమకొండ జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కడియం హామీ ఇచ్చారు. కాగా, ఎమ్మెల్యే కడియంను దేవాలయాల అభివృద్ధి కమిటీ, గ్రామస్తులు సత్కరించారు. కొండ దిగువన గల శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే శ్రీహరి ప్రత్యేక పూజలు జరిపి ఆశీర్వచనాలు పొందారు. అనంతరం ఆయన మండలంలోని తిమ్మాపూర్‌లో ఇటీవల మృతి చెందిన కొడిమాల నాగయ్య చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, మాజీ ఎంపీపీలు కట్టా మనోజ్‌రెడ్డి, రడపాక సుదర్శన్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, ఆలయాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, గౌరవ అధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, ఉపాధ్యక్షుడు తాటికాయల యాకయ్య, మాజీ సర్పంచ్‌లు కుల్ల మోహన్‌రావు, మొగిలిపాక నర్సింగం, ఇల్లందుల మొగిలి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల అయిలయ్య, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు నీలం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- అపశ్రుతులు దొర్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదే
- విద్యుత్ దీపాలు, క్రేన్లు, తెప్పలు అందుబాటులో ఉండాలి
- నెల్లుట్ల చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



నెల్లుట్ల చెరువులో నిమజ్జన ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కలెక్టర్

లింగాలఘణపురం, సెప్టెంబరు 13: నవరాత్రోత్సవ వేడుకలు ముగిసిన సందర్భంగా జనగామ పట్టణానికి చెందిన వినాయక విగ్రహాలను నెల్లుట్ల చెరువులో నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం లింగాలఘణపురం మండలం నెల్లుట్ల చెరువును డీసీపీ రాజమహేంద్రనాయక్, అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి సందర్శించిన కలెక్టర్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువువద్ద నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి అపశృతులు దొర్లకుండా అవసరమైన పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన విద్యుత్‌దీపాల ఏర్పాటుతో పాటుగా క్రేన్లు, తెప్పలు(బల్లకట్టు) ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గజీతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లోటు పాట్లు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణు మాధవ్, ఆర్డీవో కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎన్‌పీడీసీఎల్ డీఈ లక్ష్మీనారాయణ, ఏడీఈ అనిల్‌కుమార్, ఏసీపీ పార్థసారథి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై బండి శ్రవణ్‌కుమార్, ఏఈ శం కరయ్య, లైన్‌మెన్ నర్సయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల అరెస్టులు



జనగామలో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నేతలు

జనగామ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, పాడి కౌశిక్‌రెడ్డి మధ్య నెలకొన్న మాటల యుద్ధం, ఉద్రిక్తతల నేపథ్యంలో జనగామ జిల్లాలో బీఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు బీఆర్ఎస్ నేతలంతా హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా పోలీసులు కట్టడి చేశారు. శుక్రవారం తెల్లవారుజామునే పోలీసులంతా బీఆర్ఎస్ నేతల ఇళ్ల వద్దకు వెళ్లి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జనగామ జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ హైదరాబాద్‌కు వెళ్లకుండా పోలీసులు అరెస్టులు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు సురేశ్‌రెడ్డి, మసివుర్ రహమాన్, మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్, మహ్మద్ సలీం, నవీన్‌బాబు తదితరులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి ఆహ్వానం

జనగామ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జనగామ మెడికల్ కాలేజీతో పాటు జిల్లా ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ల్యాబ్ అటెండెంట్-15, డేటా ఎంట్రీ ఆపరేటర్-7, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్-3, ధోబీ-4, సిటి స్కాన్ టెక్నీషియన్- 3, ఈసీజీ స్కాన్ టెక్నీషియన్ - 2, అనస్తీషియా టెక్నీషియన్- 4, ఎలక్ట్రీషియన్ - 2, ప్లంబర్- 1, డ్రైవర్- 1, థియేటర్ అసిస్టెంట్- 2, గ్యాస్(ఆక్సిజన్) ఆపరేటర్- 2, వార్డ్ బాయ్స్- 4 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈనెల 18, 19, 20 తేదీలలో చంపక్‌హిల్స్‌లోని ఎంసీహెచ్ ఆసుపత్రి రెండో అంతస్తులో ఉన్న ప్రిన్సిపాల్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. 'జేఎంసీజనగామ, జనగామ. తెలంగాణ వెబ్‌సైట్ల నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు అర్హత సర్టిఫికెట్లు జతచేయాలని తెలిపారు. దరఖాస్తు రుసుము ఎస్సీ, ఎస్టీలకు రూ.100, ఇతరులకు రూ.200, దివ్యాంగులకు ఉచితమని పేర్కొన్నారు.

ఐక్యంగా సాగించిన సమరమే సాయుధ పోరాటం

సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ జాతీయ సహాయ కార్యదర్శి పోటు రంగారావు



కడవెండిలో దొడ్డి కొమురయ్య స్మారక స్థూపం వద్ద మాట్లాడుతున్న సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ జాతీయ కార్యదర్శి పోటు రంగారావు

దేవరుప్పుల, సెప్టెంబరు 13: హిందూ, ముస్లిం పేదలంతా ఐక్యంగా సాగించిన సమరమే తెలంగాణ ప్రజల సాయుధ పోరాటమని సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ జాతీయ సహాయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య, కామారెడ్డిగూడెంలో షేక్ బందగీల స్మారకస్తూపం వద్ద ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కడవెండి, కామారెడ్డిగూడెం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయాగ్రామాల్లో జరిగిన వేర్వేరు సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ భూస్వామ్య, రాచరిక బానిసత్వంపై తిరగబడి భూమికోసం భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం వీరోచితంగా పోరాడి దొరల గడీలను బద్దలు కొట్టిన వీరులు దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ అని కొనియాడారు. అలాంటి పోరాటాన్ని నేడు బీజేపీ, సంఘ్ పరివార్ మూకలు దేశంలో స్వాతంత్రోద్యమాన్ని వక్రీకరించినట్లే హిందూ, ముస్లింల మధ్య పోరాటంగా చిత్రీకరించే కుటిలత్వానికి పూనుకున్నదన్నారు. జమీందారులు, ప్రభువుల పల్లకీలు మోసిన వీరు, నేడు ప్రజల మధ్య విద్వేశాలకోసం చరిత్రను వక్రీకరించే యత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కడవెండి, కామారెడ్డిగూడెం వేదికనుంచి సెప్టెంబరు 13నుంచి 18వరకు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ప్రచారసభలు జరుపాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గడ్డం సదానందం, గోకినపెల్లి వెంకటేశ్వరరావు, ప్రతినిధులు సాయం చినచెంద్రన్న, ఆవుల వెంకటేశ్వర్లు, పీవై. పుల్లయ్య, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లా కార్యదర్శులు శివకుమార్, రవి, చిర్రా సూరి, పీడీఎస్‌యూ, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ఎదుగుదలకు నైపుణ్యం ఎంతో అవసరం

- వరంగల్ నిట్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుధి



సీజేఐటీలో అతిథులతో గ్రాడ్యుయేట్లు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 13: విజయవంతమైన కెరీర్ ఎదుగుదలకు నైపుణ్యం ఎంతో అవసరమని వరంగల్ నిట్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుధి అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో 22వ గ్రాడ్యుయేషన్ జరిగింది. ఈ కార్యక్రమానికి బిద్యధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యూఎస్ఏలో ఒకటో ఏరోప్లేన్ రూపొందించడంలో రైట్ బ్రదర్స్ యొక్క ఆదర్శప్రాయమైన ఉదాహరణను అనుకరించాలన్నారు. గ్రాడ్యుయేట్లు ఉత్తీర్ణత సాధించాలనే అభిరుచి స్ఫూర్తితో మిషనరీగా ఉండాలన్నారు. అనంతరం గౌరవ అతిథి అగ్నేస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్లు సైన్స్ అండ్ టెక్నాలజీ మూలాలను బలోపేతం చేయడానికి వినూత్న పరిశోధనలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డి ప్రతీ విభాగం వారీగా టాపర్లకు పతకాలు అందజేశారు. 2019-23 అకాడమిక్‌కు సంబంధించి సివిల్ డిపార్ట్‌మెంట్‌లో అత్యుత్తమ అవుట్‌గోయింగ్ విద్యార్థి జి.గావియర్‌రెడ్డిని ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఏ.ఎస్.రావు, ఆజం, స్వప్న, యాకూబ్, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ఓటు బ్యాంకు రాజకీయం

జీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంకిడి మనోహర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 13 : కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు కోసం రాజకీయం చేస్తుండగా బీజేపీ మాత్రం దేశ ప్రతిష్టతను ప్రపంచ పటంలో నిలబెట్టేలా పరితపిస్తుందని బీజేపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంకిడి మనోహర్ రెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన శుక్రవారం హంటర్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంకిడి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడాడు. అధికారం కోసం కుటుంబపార్టీలు ఎడాపెడా హామీలు గుప్పిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉందని నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ శ్రమించి సభ్యత్వ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జీ భరత్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్‌చందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, సిరంగి సంతోష్, గురు ప్రసాద్, పులి సరోత్తంరెడ్డి, రాజరెడ్డి, రాంబాబు, కార్పొరేటర్లు బైరి లక్ష్మీ, రావుల కోమల, గుజ్జుల వసంత, అభినవ్‌భాస్కర్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో రొబోటిక్స్ శిక్షణ పూర్తి



కడిపికొండ జడ్పీహెచ్ఎస్‌లో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో డీఎస్‌వో

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13: జిల్లాలోని 12 పాఠశాలల్లో సోహం అకాడమీ ఆధ్వర్యంలోవిద్యార్థులకు రొబోటిక్స్‌పై శిక్షణ శుక్రవారంతో ముగిసింది. శిక్షణ కార్యక్రమంలో కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శిక్షకులుగా పాల్గొని విద్యార్థులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దినట్లు డీఎస్‌వో శ్రీనివాస స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 6 నుంచి 10 తరగతులకు చెందిన విద్యార్థులకు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలను నేర్పుకున్నారన్నారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ జిజ్ఞాసను పెంపొందించడంలో ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జిల్లాలో మొత్తం 370 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ హిందీ భాషా దినోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 : జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేయూ హిందీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవ్ పాల్గొని ప్రసంగించారు. సాంస్కృతికంగా హిందీకి గొప్ప వారసత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి, డాక్టర్ వెంకట్‌నాయక్, అధ్యాపకులు అంజన్‌రావు, జోస్న, హరికుమార్, చందర్, పీఆర్వో ఆదిరెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవ్

ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీచేతన్‌శౌర్య

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 13: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తా నగరంలో జరిగే ఆల్ ఇండియా సబ్ జూనియర్స్ అండర్ - 13 బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ పోటీలకు వరంగల్ జిల్లా బల్దియా ఇండోర్ స్టేడియం క్రీడాకారుడు శ్యామల శ్రీచేతన్ శౌర్య ఎంపికయ్యాడు. ఈ నెల 14 నుంచి 19 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాడని బ్యాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్ రావు తెలిపారు. శ్రీ చేతన్ శౌర్య ఇటీవల దేశవ్యాప్తంగా పలు చోట్ల జరిగిన ర్యాంకింగ్ టోర్నమెంట్‌లలో డబుల్స్‌లో 3వ ర్యాంకు, సింగిల్స్‌లో 4వ ర్యాంకు సాధించి ప్రత్యేక ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారుడిని వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. రమేష్‌రెడ్డి, బల్దియా స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్‌లింగం, కోచ్ శ్రీధర్‌రావులతో పాటు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

నేడు కేయూ పరిధిలోని కళాశాలలకు పనిదినం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 13: కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు వర్సిటీ పరిధిలోని యూజీ, పీజీ కళాశాలలన్నీ సెప్టెంబరు 14న రెండో శనివారం యథావిధిగా పని చేస్తాయని కేయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబరు 2న భారీ వర్షాల నేపథ్యంలో వర్సిటీతో పాటు వర్సిటీ కళాశాలలకు సెలవు ప్రకటించడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు శనివారం పనిదినంగా పాటించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన అభినవ నేతాజీ


నేతాజీని అభినందిస్తున్న యోగా గురువు కమలాకర్

శంభునిపేట, సెప్టెంబరు 13: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు వరంగల్‌నగరంలోని రంగశాయిపేటకు చెందిన అడుప అభినవ నేతాజీ ఎంపిక అయ్యారని ఉమ్మడి వరంగల్ జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి కమలాకర్ శుక్రవారం తెలిపారు. ఆగస్టు 25న ఉమ్మడి జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీలలో 16-18 సంవత్సరాల విభాగంలో నేతాజీ ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌తోపాటు గోల్డ్‌మెడల్ సాధించాడని తెలిపారు. నేతాజీ ప్రతిభను గుర్తించి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే 8వ రాష్ట్ర స్థాయి యోగా క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నేతాజీకి అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా, మాజీ కార్పొరేటర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, సాంబశివారావు, జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయురాలు రజిత నేతాజీని అభినందించారు.

సామాజిక స్వచ్ఛతే లక్ష్యంగా..

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం
- కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- పక్షం రోజుల పాటు విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన



వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13: పాఠశాల దశ నుంచే విద్యార్థులకు సామాజిక అవగాహన కల్పించాలని, సామాజిక కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోనే పరిసరాలు, ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయనే విషయాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో భారత జల శక్తి మంత్రిత్వ శాఖ 2016లో స్వచ్ఛ పక్వాడ్ అనే కార్యక్రమాన్ని రూపొందించింది. ఏటా సెప్టెంబరు 1 నుంచి 15 వరకు పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ మేరకు ఈ నెల ఒకటి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుంది. విద్యార్థులను సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది.

తొమ్మిదేళ్లుగా..

విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ వారిని సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 2016లో పాఠశాలల్లో 15 రోజుల పాటు స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. 2016 మొదలుకొని వరుసగా 9 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తూనే ఉంది. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు పక్షం రోజుల పాటు నిరంతరంగా స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం పాఠశాలల్లో నిర్వహించేందుకు అన్ని జిల్లాల డీఈవోలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.


పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

అందరి భాగస్వామ్యంతో..

పాఠశాలల్లో అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛపక్వాడ కార్యక్రమం జరుగుతోంది. సమాజాన్ని, విద్యార్థులను భాగస్వాములను చేసి రోజువారి కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయులు నిర్వహించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పేరెంట్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీలు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలు, సమన్వయంతో హెడ్మాస్టర్లు స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన

స్వచ్ఛపక్వాడ్ కార్యక్రమం ద్వారా ప్రధానంగా విద్యార్థులకు పరిశుభ్రత, స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తారు. వ్యక్తిగత పరిశుభ్రత పట్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజెప్పుతారు. ఆరోగ్యకరమైన అలవాట్లను ఎలా అలవర్చుకోవాలో వారికి వివరిస్తారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన పాఠశాల ప్రాంగణాలను ఎలా నిలుపుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తారు.

నీటి పొదుపుపై

స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమంలో మరో ప్రధానాంశం నీటి పొదుపు. వర్షపు నీటిని నిలువ చేయడం, ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించడం, రక్షిత నీటిని వాడుకోవడం తదితర అంశాలపై హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. అదే విధగా మురుగునీరు వల్లకలిగే దుష్ప్రయోజనాలు, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తారు.

స్వచ్ఛ పక్వాడ జరుగుతోందిలా..

1న:	పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛతా శపథం
2, 3న:	విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు
4, 5న:	విద్యార్థులు సమాజానికి చేరువయ్యే కార్యక్రమాలు
6న:	పాఠశాలల్లో మొక్కలు నాటడం
7, 8న:	విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీల నిర్వహణ
9, 10న:	విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం
11న:	వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం
12న:	విద్యార్థులను సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం
13, 14న:	పాఠశాలల్లో స్వచ్ఛతా కార్యక్రమాలపై ప్రణాళికల అమలు
15న:	స్వచ్ఛత పఖ్వాడ ముగింపు, విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
వరంగల్	724	32,384
హనుమకొండ	532	30,819
జనగామ	508	30,875
మహబూబాబాద్	921	60,438
జయశంకర్ భూపాలపల్లి	430	19,652
ములుగు	552	37,287

స్వచ్ఛ పక్వాడ అమలుకు పక్కా ప్రణాళిక

మామిడి జ్ఞానేశ్వర్, వరంగల్ డీఈవో



జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించేందుకు పక్కా ప్రణాళికను అమలు చేస్తున్నాము. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు కార్యక్రమ వివరాలతో కూడిన ఆదేశాలను జారీ చేశాము. రోజువారి కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు పాఠశాల విద్యాశాఖ గూగుల్ లింక్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించాం. జిల్లాలో విద్యాశాఖ సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

స్వచ్ఛ పక్వాడ అమలుకు అన్ని చర్యలు

ఎ.శ్రీనివాస్, ఏఎంవో, హనుమకొండ



జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం అమలుకు అన్ని చర్యలు చేపట్టాం. డీఈవో ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీరోజు కార్యక్రమంపై పర్యవేక్షణ కొనసాగుతోంది. పక్షం రోజుల పాటు జిల్లాలో కార్యక్రమాన్ని అందరి సహకారంతో విజయవంతం చేస్తాం.

పాఠశాలల పరిశుభ్రత

స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీసుకుంటున్నారు. దీంట్లో భాగంగా పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా మార్చాలి. ఆవరణలో నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలల్లో ఉపయోగం లేని ఫర్నిచర్ తదితర వస్తువులను తొలగించాలి. ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా తొలగించాలి.

నేటి నుంచి దర్గా రైల్వే గేటు మూసివేత

కాజీపేట, సెప్టెంబరు 13: రైల్వే ట్రాక్ మరమ్మత్తులు దృష్ట్యా ఈనెల 14 నుంచి 18 వరకు దర్గా రైల్వే గేట్ మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గం మీదుగా ప్రయాణించే వారు ఐదు రోజుల పాటు ఇతర మార్గాల ద్వారా ప్రయాణించాలని తెలిపారు.

పత్తి క్వింటా రూ.7,940

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 13: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం పత్తి ధర పెరిగింది. గత కొద్ది రోజులుగా పెరుగుతూ వస్తుంది. మార్కెట్‌కు 452 బస్తాల పత్తి అమ్మకానికి రాగా గరిష్టంగా క్వింటా రూ.7940 ధర పలికింది. గత నెల రోజుల క్రితం వరకు పత్తి ధర క్వింటాకు రూ.7,400, రూ.7,500 వరకే ఉండగా ఇటీవల కొద్ది రోజులుగా రోజు కొద్దికొద్దిగా పెరుగుతూ రూ.7,940 చేరింది. మరోపక్క మార్కెట్లోకి కొత్తపత్తి రాక మొదలైంది. కొత్తపత్తికి క్వింటా రూ.7211 పలికింది. ఇటీవల కురిసిన వర్షాలకు చాలా చోట్ల పత్తి పంటలో పూత, కాత రాలిపోయింది. కనీసం వచ్చిన పత్తి పంటకైనా గిట్టుబాటు ధర(క్వింటా రూ.10వేలు) లభిస్తే అంతేచాలు అన్నట్లు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొత్త మొక్కజొన్నలకు క్వింటాకు రూ.2,930 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజాభవన్‌లో వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన


ప్రజా భవన్‌లో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 13: హైదరాబాద్ తెలంగాణ ప్రజా భవన్‌లో శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వర్సిటీలో చాలా ఏళ్లుగా పని చేస్తున్నామని, వయస్సు మీద పడి రిటైర్‌మెంట్‌కు చేరవయ్యామని, మానవతా దృక్పథంతో ఆలోచించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ వర్సిటీస్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకునేందుకు ట్రాక్‌పైకి మహిళ

రెండేళ్ల కూతురితో రాగా కాపాడిన రైల్వే పోలీసులు

గిర్మాజిపేట, సెప్టెంబరు 13 : రెండేళ్ల కూతురుతో సహ రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించిన మహిళను ప్రభుత్వ రైల్వే పోలీసులు కాపాడిన ఘటన శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ కథనం ప్రకారం. హనుమకొండలోని డబ్బాలకు చెందిన 27ఏళ్ల పి.మానస తన రెండేళ్ల కూతురిని తీసుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ప్లాట్‌ఫాంపై కూతురుతో కలిసి మానస తిరుగుతున్న సమయంలో సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కొద్ది క్షణాల్లో ప్లాట్‌ఫాం ఒకటిపై వస్తుందనే అనౌన్స్‌మెంటు వచ్చింది. ఇది విన్న మాన స, కూతురును ఎత్తుకుని రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్‌బ్రిడ్జి దాటిన తర్వాత రైలు పట్టాలపై నిలబడింది. అదే లైన్‌పై కాజీపేట నుంచి గోల్కొండ వరంగల్ వైపు రావాల్సి ఉంది.. డ్యూటీలో ఉన్న రైల్వే కీమెన్‌లు గమనించి జీఆర్‌పీకి సమాచారం అందించారు. జీఆర్‌పీ సిబ్బంది కె.విక్రమ్, కె.ప్రశాంతి, సీహెచ్.సుమలత హుటాహుటిన మహిళ దగ్గరకు చేరుకుని పాపతో సహ కాపాడి జీఆర్‌పీకి తరలించారు. అనంతరం మానసకు కౌన్సెలింగ్ చేసి మాట్లాడగా తన భర్త పేరు, నివాసం వివరాలు చెప్పింది. అదే సమయంలో మానస తమ్ముడు క్రాంతికుమార్, భర్త ప్రవీణ్‌లు మానస, పాపలను వెతుక్కుంటూ జీఆర్‌పీకి చేరుకున్నారు. తన భార్య మానసకు కొంతకాలంగా మానసిక ఆరోగ్యం సరిగాలేదని చెప్పగా, వారికి కౌన్సెలింగ్ చేసి సీఐ పంపించారు. తల్లీ బిడ్డలను కాపాడిన సిబ్బంది విక్రమ్, ప్రశాంతి, సుమలతలను సీఐ సురేందర్ అభినందించారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

డోర్నకల్ సెప్టెంబరు 13 : బాలికపై లైంగికదాడికి యత్నించిన ఒకరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్‌నాయక్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో శుక్రవారం బాలిక పాఠశాలకు వెళుతుండగా ఓ వ్యక్తి (35) స్కూల్ వద్ద దింపుతానని ద్విచక్రవాహనాన్ని ఎక్కించుకున్నాడు. ఎవరూలేని చోట మార్గ మధ్యలో ఆ వాహనాన్ని ఆపి, బాలిక (11)పై లైంగిక దాడికి యత్నించాడు. అతడి బారి నుంచి బాలిక తప్పించుకొని, పాఠశాలకు వెళ్లి జరిగిన విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పింది. వెంటనే వారు బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేశారు. దీం తో తల్లిదండ్రులు స్కూల్‌కు వచ్చి బాలికను తీసుకొని డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఓజోన్ డే సందర్భంగా విద్యార్థులకు పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 : ఓజోన్ డేను పురస్కరించుకొని ఈ నెల 16న రీజనల్ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో డి. వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హంటర్‌రోడ్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో ఎస్. శ్రీనివాసస్వామి (94901 12848)ను సంప్రదించాలని ఆమె కోరారు.

‘ఆదిదేవ’లో అన్నీ ప్రత్యేకతలే

43 ఏళ్లుగా గణేష్ ఉత్సవాలు.. ఏటా రూ.2లక్షలకుపైగా పలికే లడ్డూ

కులమతాలకతీతంగా 502 మంది సభ్యులతో సంఘం నిర్వహణ


కేసముద్రం రైల్వేస్టేషన్ వద్ద ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన భారీ గణేష్ మండపం, వినాయకుడు

కేసముద్రం, సెప్టెంబరు 13: సాధారణంగా వినాయక ఉత్సవాలు వచ్చాయంటే చందాలు వసూలు అనేది సర్వసాధారణం. కానీ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్, రైల్వే ఎంప్లాయిస్, శ్రీగణేష్ ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలు మాత్రం ఇందుకు భిన్నం. 1981 నుంచి అంటే సుమారు 43ఏళ్లుగా చందాల సేకరణ లేకుండా కేసముద్రం రైల్వేస్టేషన్ ఆవరణలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అయితే కుల, మతాలకతీతంగా 2011లో 160 మందితో ఏర్పాటైన ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్‌లో గతేడాది 465 మంది సభ్యులు ఉండగా.. ఈఏడాది ఆ సంఖ్య 502కు చేరింది. ఇందులోని ప్రతీ సభ్యుడు నెలకు రూ.200 చొప్పున పొదుపు చేస్తుంటారు. అలా సమకూరిన డబ్బులను అవసరం ఉన్నవారికి రుణాలివ్వడం, వాటిపై వచ్చిన వడ్డీ సొమ్ముతోపాటు స్వచ్ఛందంగా రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ సహకారంతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం రూ.1.20కోట్ల మూలధనంతో కొనసాగుతున్న ఈ అసోసియేషన్‌లో కేసముద్రం మండలంలో అన్ని వర్గాలు, రంగాలకు చెందిన ప్రముఖులు, నాయకులు సభ్యులుగా ఉన్నారు. ఇదిలాఉంటే సంఘం తరఫున రెండేళ్లకొకసారి సభ్యులంతా తిరుపతికి వెళ్లిరావడం మరో ప్రత్యేకత. అయితే గత 11 ఏళ్లుగా ఈ గణేష్ ఉత్సవాల్లో 10 రోజుల పాటు నిత్యాన్నదానం చేయగా ఈ ఏడాది వర్షాల కారణంగా వాయిదా వేశారు. ఈ ఉత్సవాలకు రూ.10లక్షలవరకు ఖర్చు చేస్తున్న నిర్వాహకులు మండపం వద్ద కోతుల నుంచి రక్షణగా ఓ కొండెంగను ఒంటిస్తంభం ఇంటిపై ఏర్పాటు చేయడం విశేషం.

రికార్డు స్థాయిలో లడ్డూ వేలం

ఆదిదేవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయకుడి వద్ద లడ్డూకు హైదరాబాద్ బాలాపూర్ లడ్డూకు ఉన్నట్టుగా డిమాండ్ ఉంటుంది. ఇక్కడి లడ్డూను దక్కించుకోగలిగితే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవాల చివరి రోజున వేలంపాట ప్రతిష్ఠాత్మకంగా జరుగుతుంది. 2018లో ఇక్కడి లడ్డూ ఉమ్మడి జిల్లాల్లోనే అత్యధికంగా రూ.1.71లక్షలు పలికింది. 2019లో రూ.2.11లక్షలు, 2022లో రూ.2,01,516, గతేడాది రూ.2,21,116, పలికింది.

చందాలు అడగకుండా నిర్వహణ

మంచెన శ్రీనివాస్
ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి



ఏటా ఎవరినీ చందాలు అడగకుండా మా వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి ఆర్థిక సహకారం అందిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. ఈ సారి ఉత్సవాలకు రూ.9 లక్షలపైగా ఖర్చవుతున్నట్లు అంచనా. రైల్వేశాఖ, కేసముద్రంతో పాటు వివిధ ప్రాంతాలు, విదేశాల్లో ఉన్న భక్తులు ఈ ఉత్సవాలకు సహకరిస్తున్నారు.

రైలు కిందపడి పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

జనగామ జిల్లా వంగాలపల్లి రైల్వేగేటు సమీపంలో ఘటన


రాజ్‌కుమార్ (ఫైల్)

చిలుపూర్, సెప్టెంబరు 13 : రైలు కిందపడి ఓ పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని వంగాలపల్లి రైల్వేగేటు సమీపంలో శుక్రవారం జరిగింది. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జఫర్‌గఢ్ మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన కొడారి రాజు- రమ దంపతుల పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని శివునిపల్లి సెయింట్ థామస్ హైస్కూల్‌లో హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం పాఠశాలకు సంబంధం లేని కొందరు యువకులు రాజ్‌కుమార్ ఉండే హాస్టల్‌లోకి చొరబడి అతడితో పాటు అతడి స్నేహితులతో గొడవ పడ్డారని, ఈ విషయాన్ని సమస్యను పాఠశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో భయాందోళనకు గురైన తమ కుమారుడు పాఠశాల నుంచి బయటకు వెళ్లి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రాజ్‌కుమార్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. కాగా, తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరే కారణమని, తమ కుమారుడు శుక్రవారం ఉదయం 5.30గంటలకు బయటకు వెళ్తే, పాఠశాల యాజమాన్యం తమకు 10 గంటలకు సమాచారమిచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడు కనిపించకుండా పోయిన విషయమై తాము పోలీసులకు ఫిర్యాదు చేసేలోపే మరణవార్త వినాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. అయితే ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ కేసీ జాన్ బన్నీని వివరణ కోరగా, బయటి వ్యక్తులు ఎవరూ తమ పాఠశాల ఆవరణలోకి రాలేదన్నారు. కేవలం అది దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సదరు విద్యార్థి రాజశేఖర్ శుక్రవారం ఉదయం 7 గంటలకే స్నానం చేసి బయటకు వెళ్లాడని, స్టేషనరీ వస్తువులు కొనుక్కునేందుకు వెళ్లి ఉంటాడని భావించామని, కానీ తరగతులు ప్రారంభమైనా రాకపోవడంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులకు సమాచారమిచ్చామని వివరించారు. రాజశేఖర్ తల్లిదండ్రులు వచ్చాక వాళ్లు, తాము కలిసి స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లామని, పోలీసులకు ఫిర్యాదు ఇస్తుండగానే ఆత్మహత్య విషయం తెలిసిందని వివరించారు. విద్యార్థి మృతి తమను కలిచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాజశేఖర్ ఆత్మహత్య ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెయింట్ థామస్ పాఠశాల ఎదుట స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏచూరి లేని లోటు పూడ్చలేనిది

సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి చక్రపాణి

నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ

బాలసముద్రం, సెప్టెంబరు 13: మూడు దశాబ్దాలకు పైగా సీపీఎం కేంద్ర పార్టీ నాయకత్వ బృందంలో పలు అంశాలపై పార్టీ రాజకీయ వైఖరులను రూపొందించి ముఖ్య భూమిక పోషించిన సీతారాం ఏచూరి ఆయన తుది శ్వాస విడిచే వరకు ప్రజా పోరాటాల్లో నిమగ్నమయ్యారని హనుమకొండ సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరికి సంతాప సూచికగా హనుమకొండ చౌరస్తా నుంచి కొవ్వొత్తుల ర్యాలీ అశోక జంక్షన్ వరకు నిర్వహించారు. ఈసందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ భారత రాజకీయాలలో సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తే ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీలు గొడుగు వెంకట్, జి.రాములు, డి.తిరుపతి, దీప, జిల్లా నాయకులు టి.ఉప్పలయ్య, వాంకుడోత్ వీరన్న, మంద సంపత్, డి.భానునాయక్, గాదె రమేష్, ఎన్.కిశోర్, జి.ప్రతాప్, కె.కుమారస్వామి, కారు ఉపేందర్, కుక్కముడి రవీందర్, ఎం.రమాదేవి, డి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్నసీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి చక్రపాణి, నేతలు

- కాజీపేట: కాజీపేట ఫాతిమా జంక్షన్‌లో శుక్రవారం ఏచూరి సీతారాం సంతాప సభ జరిగింది. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య నాయకులు ఓ.సాంబయ్య, జె.రమేశ్, టి.మల్లేశం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తహసీల్దార్‌ను దూషించిన దంపతులపై కేసు

ఐనవోలు, సెప్టెంబరు 13: తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించి దూషించిన భార్యభర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. సింగారం గ్రామానికి చెందిన శాగంటి లక్ష్మీరాములు దంపతులకు రాజ్‌కుమార్, శేఖర్ కుమారులున్నారు. ఇద్దరికి రెండు ఎకరాల చొప్పున గతంలో భూమిని పంపిణీ చేశారు. రాజ్‌కుమార్ మృతిచెందడంతో ఆయన కుమారుడు హర్షవర్ధన్ పేరుమీదు రెండు ఎకరాల భూమిని శుక్రవారం తాతానాయనమ్మలు రిజిష్ట్రేషన్ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న శేఖర్ ఆయన భార్య మౌనికలు తమ కుటుంబానికి చెందిన భూమిని తనకు తెలియకుండా ఎలారిజిష్ట్రేషన్ చేస్తారంటూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వాగ్వాదం చేశారు. నిబంధనల ప్రకారం చేస్తున్నామని తహసీల్దార్ ఎంత నచ్చచెప్పినా వారు వినకుండా తహసీల్దార్‌ను దుర్భాషలాడి దురుసుగా ప్రవర్తించారు. దీంతో తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్యభర్తలు కలిసి విధులకు ఆటంకం కలిగించారని వారిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువు వద్ద మృతశిశువు లభ్యం

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి కంటపడిన వైనం

జనగామ జిల్లా నెల్లుట్లలో అమానవీయ ఘటన


నెల్లుట్ల చెరువు వద్ద లభ్యమైన మృతశిశువు

లింగాలఘణపురం, సెప్టెంబరు 13 : అప్పుడే పుట్టిన మగశిశువుని ప్లాస్టిక్ సంచిలో మూటగట్టి గుర్తుతెలియని వ్యక్తులు చెరువులో పడేశారు. ఈ అమానవీయ ఘటన జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల పెద్దచెరువు వద్ద శుక్రవారం జరిగింది. జనగామ పట్టణానికి చెందిన మారపాక కార్తీక్ అనే యువకుడు శుక్రవారం పట్టణ సమీపంలోని నెల్లుట్ల పెద్దచెరువు వద్ద చేపలు పట్టేందుకు గాలం వేశాడు. ఆసమయంలో పక్కనే చెట్ల పొదల మధ్య నల్లని ప్లాస్టిక్ కవర్‌లో మూటగట్టిన మృతశిశువు ఆనవాళ్లు కనిపించాయి. దీంతో వెంటనే భయాందోళనకు గురైన కార్తీక్ తన సోదరుడు నవీన్‌కు తెలపడంతో అతడు వెంటనే లింగాలఘణపురం పోలీసులకు సమాచారమిచ్చాడు. వెంటనే సిబ్బందితో అక్కడికి చేరుకున్న లింగాలఘణపురం ఎస్ఐ బండి శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. ప్లాస్టిక్ కవర్‌ను తెరిచి చూడగా అందులో మగ మృత శిశువును కనిపించింది. అయితే శరీరంపై రక్తపు మరకలు, బొడ్డు తాడును చూస్తే పుట్టిన గంట వ్యవధిలో ఈ మగశిశువును గుర్తుతెలియని వ్యక్తులు చెరువులో పడేసి ఉంటారని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. సంఘటనాస్థలంలో వివరాలు సేకరించిన ఎస్సై శ్రవణ్‌కుమార్ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. శిశువు మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

మహబూబాబాద్ జిల్లాలో ఘటన


మృతి చెందిన మన్విత్ శకుంతల్

పెద్దవంగర, సెప్టెంబరు 13: ప్రమాదవశాత్తు ఆడుకుంటూ.. నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం. చిట్యాల గ్రామానికి చెందిన తన్నీరు వేణు-రమ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కొడుకు సాయిశకుంతల్ పాఠశాల వెళ్లగా, చిన్నకొడుకు మన్విత్ శకుంతల్ (5) ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సం పులో పడ్డాడు. ఇది గమనించని తల్లిదండ్రులు బాలుడి కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అనుమానం వచ్చి వారు నీటి సంపులో వెతుకగా, అప్పటికే మృతి చెందిన మన్విత్‌శకుంతల్ మృతి చెంది కనిపించాడు. బాలుడు తల్లి రమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం పోలీసులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కన్న కొడుకు కళ్లముందే మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2930	2805
పల్లికాయ (సూక)	5500	4500
పల్లికాయ (పచ్చిది)	4150	3400
కందులు	8659	6750
పెసలు	7422	4552
పత్తి	7940	5500
పసుపు (కాడి)	12379	10000
పసుపు (గోల)	11844	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18500	14000
వండర్‌హాట్ ఏసీ	15500	13000
యూఎస్341 ఏసీ	15500	11000
దేశీ ఏసీ	24000	20000
సింగిల్‌పట్టి ఏసీ	21800	21800
తాలు మిర్చి	6000	3000

\- వరంగల్ వ్యవసాయం

సీతారాం ఏచూరి మృతి పేదలకు తీరని లోటు

రఘునాథపల్లి,సెప్టెంబరు 13: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పొదల నాగరాజు, మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, బీమగోని చంద్రయ్య, గొలనుకొండ చక్రపాణి, అరూరి యాదగిరి, శాగ సాంబరాజు, నర్సింగరావు, రఘుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొదల లవకుమార్, అనిల్, సందిప్, వెంకటేష్, వంశీ, శ్యామ్ పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : సీతారాం ఏచూరి మృతి సీపీఎంకు తీరని లోటు అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శుక్రవారం సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కమిటీ సభ్యుడు కోడెపాక యాకయ్య, గట్ల మల్లారెడ్డి, కుర్ర ఉప్పలయ్య, చిలుముల్ల భాస్కర్, సుదర్శన్, పరమేష్, వంగపండ్ల సోమయ్య, ఐలయ్య, కిష్టయ్య, పొగాకు యాదగిరి, రాజుపాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి జఫర్‌గడ్ మండల వామపక్ష పార్టీల నేతలు నివాళులు అర్పించారు. శుక్రవారం జఫర్‌గడ్ సెంటర్‌లో ఏచూరి చిత్ర పటం వద్ద సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు రాపర్తి సోమయ్య, జువారి రమేశ్, సీపీఎం శ్రేణులు నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో సీపీఎం నేతలు కాట సుధాకర్, గుండెబోయిన రాజు, వడ్లకొండ సుధాకర్, ఎండి.షబాన, శంషోద్దిన్, వేల్పుల రవి పాల్గొన్నారు.



బచ్చన్నపేటలో సంతాప సభలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

● చిలుపూర్ : కమ్యూనిస్టు పోరాట యోధుడు, సీపీఎం కేంద్ర ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సేవలు మరువలేనివని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ అన్నారు. శుక్రవారం చిలుపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా, ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. సాదం రామరాజు, మూడికె భీమయ్య, ఊరడి మల్లయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం అణగారిన వర్గాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో సంతాప సమావేశం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు బండకింది బాల్‌నారాయణ పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం ఎంతో బాధాకరమని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కళ్యాణి, వరలక్ష్మి, రజిత, భవాని పాల్గొన్నారు

● దేవరుప్పుల : సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరీ మృతి పట్ల దేవరుప్పుల మండలం సీర్మాలలో శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి స్మారక స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సింగరాపు రమేష్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఇంటి వెంకటరెడ్డి, పయ్యావుల భిక్షపతి, కాసర్ల మాధవరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

పాలకుర్తి, సెప్టెంబరు 13 : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి సమక్షంలో శుక్రవారం మండలంలోని పాలకుర్తి, గూడూరు, శాతా పురం, నర్సింగపురంతండా, వల్మిడి గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బారీగా కాంగ్రెస్‌లో చేరారు. మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఝాన్సీరెడ్డిని యాకాంతరావు ఆధ్వర్యంలో గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం రెడ్డి గార్డెన్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. పాలకుర్తి తాజా, మాజీ సర్పంచు వీరమనేని యాకాంతరావు, ఎంపీటీసీ ఎడవెల్లి పురుషోత్తంలతో పాటు సుమారు 400 మంది బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కాంగ్రెస్ కుండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రావడానికి ఉత్సాహంతో ఉన్నారని అన్నారు. నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడుగా గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, కాకిరాల హరిప్రసాదరావు, శ్రీరామ్ ఉన్నారు.



ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యాకాంతరావు తదితరులు

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

బచ్చన్నపేట, సెప్టెంబరు 13: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని, నేతల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆందోళనకు పిలుపునివ్వగా, పోలీసులు నేతలను ముందస్తుగా అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో పీఏసీఎస్ చైర్మెన్ పులిగిల్ల పూర్ణచందర్, నాయకులు తదితరులున్నారు.

● రఘునాథపల్లి : ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి మధ్య జరుగుతున్న మాటల యుద్ధం నేపథ్యంలో శుక్రవారం చలో గాంధీ నివాసానికి బీఆర్ ఎస్ పిలుపునిచ్చింది. ఈ మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

●దేవరుప్పుల : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డి ఇంటిపై అరికెపైడి గాంధీ అనుచరుల దాడికి నిరసన తెలియజేసే క్రమంలో ముందస్తు దేవరుప్పుల పోలీసులు బీఆర్ఎస్ శ్రేణులను అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల కార్యదర్శి చింత రవి మాట్లాడుతూ ఎదురొడ్డి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అక్రమ అరెస్టులు చేస్తే భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు గండిపెల్లి యాకయ్య, బానోతు గేమా, వర్రె మధు, బస్వ రమేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 13: జిల్లాలో గణపతి నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని వాసవి కాలనీలో గణపతి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మండపంలో గణపతి, ఓం, స్వస్తిక్ ఆకారంలో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి డీసీపీ రాజమహేంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

●చిలుపూర్ : వినాయక నవరాత్రి ఉత్సవాలను చివరి రోజు చేపట్టే నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై నవీన్‌కుమార్, తహసీల్దార్ సరస్వతి, ఎంపీవో శ్రీపాద మధుసూధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్కాపూర్, రాజవరం, చిలుపూర్ తదితర గ్రామాల్లో ఊర చెరువులను పరిశీలించారు. ఎమ్మార్‌ై కలువల శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీలు నవనీత, ఎమ్మీ ఆజీజ్ పాషా, తిరుమల్‌రెడ్డి, నాయకులు పోలేపల్లి రంజిత్‌రెడ్డి, నామాల మల్లేష్, ఊరడి సతీష్, పసుల వెంకటేశ్ పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఎంపీడీవో విజయశ్రీ శుక్రవారం సందర్శించి గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లగౌడ్, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అంబటి కిషన్ రాజు పాల్గొన్నారు.

● జనగామ కల్చరల్ : గణేష్ నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ రోడ్‌లో యూత్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో కుంకుమార్చన ఘనంగా జరిగింది. మహిళలుకుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● రఘునాథపల్లి : మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద శుక్రవారం విఘ్నేశ్వరుని పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లక్ష ఉండ్రాళ్ళ, లక్ష గరక పూజ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కూరెళ్ల పెద్ద ఉపేందర్, పోకల శివకుమార్ పాల్గొన్నారు.



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ రాజమహేంద్రనాయక్

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : గణపతి నవరాత్రి ఉత్సవాలు స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో ఘనంగా, భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏడో రోజు గణేశునికి భక్తులు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో పలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో విశేష పూజలు ఆచరించారు. స్టేషన్ ఘన్‌పూర్ మమత ఆసుపత్రి వద్ద ఉన్న గణపతి విగ్రహంతో పాటు పలు చోట్ల మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మా గార్డెన్ వద్ద గణపతి మండపం వద్ద ప్రముఖ వ్యాపారి గన్ను శ్రీనివాస్, మెడ్ ప్లస్ ఎదురుగా వ్యాపారి కర్నె శ్రీనివాస్ మహా అన్నదాన కార్యక్ర మాలు ప్రారంభించారు. శివునిపల్లి బరోడా బ్యాంకు ఎదురుగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి రోజు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. శనివారం శివునిపల్లి నగరేశ్వరాలయంలో వినాయక మండపం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ నాయకులు ఎ.కిషన్‌రాజు, సత్యనారాయణ, రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్శీ కృష్ణారావు, తెల్లాకుల రామకృష్ణ, పెసరు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలి

కొడకండ్ల సెప్టెంబరు 13 : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కొంతం శ్రీనివాస్ మండల, గ్రామ స్థాయి నాయకులకు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు పులిగిల్ల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సైదా రమేష్, దుబ్బ రాజశేఖర్, శివరాజ్ యాదవ్, ఎస్.కోటేశ్వర్, మోడెపల్లి సోమన్న, అంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి ఊతం గణితం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 13: విద్యార్థులు అన్ని సబ్జెక్టులు క్షుణ్ణంగా నేర్చుకోవాలంటే గణితం పునాది లాంటిదని, అది వారి అభ్యున్నతికి దోహదం చేస్తుందని స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు ఎస్ మురళీధర్ రాసిన ఎన్రిచ్‌మెంట్ ఆఫ్ బేసిక్ ఆపరేషన్స్ ఇన్ మాథమేటిక్స్ పుస్తకాన్ని ఆర్డీఓ హెచ్ఎం ఎం.సంపత, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఉపాధ్యా యులు రవికుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

చిన్న పిల్లలపై శ్రద్ధ వహించాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 13: పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ద వహించాలని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లుతో ఎస్ఓపీఎస్‌పీ కార్య నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల్ని గుర్తించి ప్రతి 15 రోజులకోసారి సరైన పద్దతిలో బరువులు, ఎత్తుల కొలతలు తీసి ఆన్‌లైన్‌లో సరైన విధంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవోలు రమాదేవి, ఫ్లోరెన్స్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జూడాలు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 13: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్ కోరారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కాలనీలో ముందు జాగ్రత్తగా చర్యల్లో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య బృందం 179 మందికి వైద్య పరీక్షలు చేశారు. కాలనీ వాసులకు వైద్య పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వీరాంజ నేయులు, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ జునైది, సీహెచ్‌ఓ చింత వెంకటస్వామి, శేషయ్య, సూపర్‌వైజర్ సునంద, ఏఎన్ఎం ప్రేమలత, స్వప్న, భవాని, సృజన, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోగ నిర్థారణ పరీక్ష కేంద్రం తనిఖీ

జనగామ రూరల్, సెప్టెంబరు 13: జనగామ జిల్లా కేంద్రంలోని రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో రక్త పరీక్షల నిర్వహణ ప్రక్రియ రోగుల నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామ జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు సూమరుగా 700 మంది వైద్య నిర్థారణ పరీక్షలకు సంబంధించిన శాంపిల్స్ సేకరించడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీలో డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్, ఎంసీహెచ్ సూపరిటెండెంట్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లీస్టు విడుదల

రఘునాథపల్లి, సెప్టెంబరు 13: అసెంబ్లీ ఎన్నికల ముందు ఉన్న గ్రామ పంచాయతీ ఓటర్ల లిస్టు ప్రకారం వార్డుల వారీగా రూపొందించిన ఓటరు లిస్టును రఘునాథపల్లి జీపీ కార్యాలయం ముందు ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘునాథపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 4,299 మంది ఓటర్లను గ్రా మంలో ఉన్న 14 వార్డులకు విభజించడం జరిగిందని తెలిపారు. ఎంపీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శి కవిత, హజ్మత్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం పై విచారణ

జనగామ రూరల్, సెప్టెంబరు 13: మాజీ సర్పంచ్, కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలపై శుక్రవారం అధికారులు విచారణ నిర్వహించారు. జనగామ మండలం పసరమడ్ల గ్రామ మాజీ సర్పంచ్ శివరాత్రి స్వప్న, కార్యదర్శి మాదం వాసంతి పై గ్రామానికి చెందిన వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో వారిపై విచారణ చేపట్టారు. గ్రామాభివృద్ధిపనులకు సంబంధించిన నిధులను సొంత ప్రయోజనాలకు వాడుకొని దుర్వినియోగం చేశారనే ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో వెంకట్‌రెడ్డి గ్రామపం చాయతీలో విచారణ నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైద్రాబాద్ లోని ప్రజా భవన్‌లో పిర్యాదు మేరకు విచారణ చేపట్టామని తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

లింగాలఘణపురం, సెప్టెంబరు13: గ్రామాల్లో పరిసరాల పారిశుధ్యంతోనే వ్యాధులను దూరంగా తరిమేయొచ్చని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే సందర్భంగా మండలంలోని పటేల్‌గూడెం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటుగా ప్రైమరీ స్కూల్ ప్రాంగణం, ప్రధాన వీధుల్లో కలియతిరిగి పారిశుద్యాన్ని పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, ఎంపీడీవో జలందర్‌రెడ్డి, ఎంపీవో రఘురామకృష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జఫర్‌గడ్, సెప్టెంబరు 13 : ఇటీవల మృతి చెందిన మండలంలోని తిమ్మాపూర్‌లో కొడిమాల నాగయ్య, తీగారంలో ఉద్దమారి ప్రభాకర్ చిత్ర పటాల వద్ద మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నివాళులు అర్పించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించి ఓదార్చారు. బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ మారపాక రవి, కో-ఆర్డినేటర్ పసునూరి మహెందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పి.జయపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గబ్బెట బుచ్చయ్య, నాయకులు కడారి శంకర్, రాజ్‌కుమార్, నరేశ్, శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల పరామర్శ

కొడకండ్ల సెప్టెంబరు 13 : మండలంలోని ఏడునూతుల గ్రామానికి చెందిన కీసర సుభాష్‌రెడ్డి , రామవరం గ్రామానికి చెందిన దుంబాల లక్ష్మణ్‌జీ, గుగులోత్ రుక్మాలు అనారోగ్య కారణా లతో శుక్రవారం ఉదయం మృతిచెందారు. విషయం తెలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచారి ఝాన్సీరెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు వారింటికి వెళ్ళి భౌతిక కాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటు ంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కీసర సునీల్ రెడ్డి, ధర్మారం భిక్షపతి, యాకేష్ యాదవ్, మసురం రవీందర్, ఐత రాజు, బత్తుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేస్తాం

చిలుపూర్, సెప్టెంబరు 13 : మండలంలోని శ్రీపతిపల్లిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు, అర్హులైన బాధిత రైతులకు న్యాయం చేస్తామని మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కలువల శ్రీనివాస్, రెవెన్యూ సర్వేయర్ నరేష్‌కుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం శ్రీపతిపల్లి రెవెన్యూ పరిధిలో వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో చేపట్టిన సర్వేను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మారై కలువల శ్రీనివాస్ మాట్లాడారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని 44, 45, 61, 62, 63, 66, 68, 69 తదితర సర్వేనంబర్లలో 1980 సంవత్సరంలో గ్రామానికి చెందిన 40 మందికి అప్పటి ప్రభుత్వం భూములను అసైన్డ్ చేయడం జరిగిందన్నారు. 2018లో నలుగురి లబ్ధిదారులకు చెందిన భూమి కబ్జాకు గురైందని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచనల మేరకు, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న ఆదేశానుసారం అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను సర్వే చేపట్టి అనర్హులను గుర్తించామని, నివేదికను రూపొందించి అధికారులకు సమర్పిస్తామన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

బచ్చన్నపేట, సెప్టెంబరు 13: బచ్చన్నపేట తహసీల్దార్‌గా ఎం.మహిపాల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విశాలాక్షి పదోన్నతిపై నారాయణరావుపేటకు వెళ్లగా, నర్మెటలో పనిచేస్తున్న మహిపాల్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బచ్చన్నపేట, సెప్టెంబరు 13: మండలంలోని 107 మంది లబ్ధిదారులకు శుక్రవారం రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరుకావాల్సి ఉండగా, హైదరబాద్‌లో పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంతో రాలేకపోయారు. కాగా ఫోన్ ద్వారా ఆయన తన సందేశాన్ని వినిపించారు. తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ ఫణికిశోర్, పీఏసీఎస్ చైర్మెన్ పులిగిల్ల పూర్ణచందర్, మాజీ ఎంపీపీ బావండ్ల కృష్ణంరాజు, సర్పంచ్‌ల పోరం మాజీ అధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్‌లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మల్లవరం సేవలు మరువలేనివి

బచ్చన్నపేట, సెప్టెంబరు 13: మండలంలోని కేశిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్‌గా, ప్రజల మధ్య ఐదు దశాబ్దాల పాటు ఉండి, ప్రజల మన్ననలు పొందిన మల్లవరం రమేశిరెడ్డి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన మృతి చెంది ఏడాది గడిచిన సందర్భంగా పార్టీలకతీతంగా పెద్ద సంఖ్యలో నాయకులు హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన భార్య మాజీ ఎంపీపీ జయమ్మ, కొడుకు వెంకటేశ్వర్‌రెడ్డికి ధైర్యం చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 13: న్యూ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా ఈ నెల 14న జనగామ పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జనగామ టౌన్ విద్యుత్ ఏఈ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గణేష్‌వాడ, ధర్మకంచ, దుర్గమ్మ గుడి, అంబేద్కర్‌నగర్, కురుమవాడ, పాత మార్కెట్, పోలీస్ స్టేషన్ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

జనగామ కల్చరల్, సెప్టెంబరు 13: టీపీటీఎఫ్ జనగామ మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఉమాపతిభవన్‌లో మండల శాఖ అధ్యక్షులు ఎ.రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మయ్య, నల్లనాగుల రాజు, ఎన్నికల పరిశీలకులుగా సీహెచ్.సత్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నుకున్న నూతన కమిటీ అధ్యక్షునిగా ఎం.గణేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.కనకయ్య, ఉపాధ్యక్షులుగా ఎ.సత్తిరెడ్డి, ఎస్.సత్యవర్ధన్‌రెడ్డి, యు.వసంత, పి.మధు, శివకుమాంర్, కార్యదర్శులుగా ఎ.శ్రీధర్, రవికుమార్, ఉమా దేవి, పిసతీష్, ఎం.శివకుమార్, జిల్లా కౌన్సిలర్లుగా ఎ.రాజారెడ్డి, ఎన్.శివకుమా ర్, శారదమ్మ, ఎం.రమేశ్, శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎండి.తహసీన్ ఎన్నికయ్యారు.

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక...

తరిగొప్పుల : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ తరిగొప్పుల మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడుగా కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడులుగా వస్కుల జాయేందర్, ఖాదర్ పాషా, నాగరాణి, ప్రధాన కార్యదర్శిగా మనుక సంపత్, కార్యదర్శులుగా బైరి సరిత, మంద దయాకర్ బాబు, సూర్న ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎంపియ్యారు. అనంతరం టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు కొండ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు.

పీజీ కళాశాలలో ట్రైనింగ్ ప్రోగ్రాం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 13: జనగామ జిల్లా కేంద్రంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. శుక్రవారం మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్, మీడియం ఎంటర్ ప్రైస్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్, ఈ మెయిల్ మార్కెటింగ్, ఎంఎస్ఎంఈ అండ్ ఫైనాన్స్ స్కీమ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శక్షిత్ ఇన్ఫోటెక్ సీఈవో జి.సుదర్శన్, ఐఈడీఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ దశరథ్, ఆర్.శ్రీకాంత్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ పుల్లా రమేశ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఎస్.దుర్గాప్రసాద్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్, పరికరాల ధ్వంసం

చిలుపూర్, సెప్టెంబరు 13 : పలువురి రైతులకు చెందిన విద్యుత్‌మోటార్లతో పాటు, స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని కృష్ణాజీగూడెంలో జరిగింది. శుక్రవారం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఊరడి యాదగిరి, సాదం రాజ్‌కుమార్, సాదం శ్రీనివాస్, కుంచాల రాజు అనే నలుగురు రైతులు రోజూమాదిరిగానే వ్యవసాయ పనులు ముగించుకుని గురువారం సాయంత్రం ఇంటికి వెళ్ళారు. శుక్రవారం ఉదయం పొలాల దగ్గరికి వచ్చేసరికి విద్యుత్‌మోటార్లు, స్టార్టర్లు, మంచాలు, ఇతర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. రైతులనుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలి

చిలుపూర్, సెప్టెంబరు 13 : ఈ నెల 17న చేపట్టే ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంపీడీవో బర్మావత్ శంకర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవానికి సంబంధించి కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రతీ జీపీ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపాద మధుసూధన్, ఈజీఎస్ ఏపీవో మోహన్‌రావు, పంచాయతీ సెక్రటరీలు తండ రాంబాబు, శ్రీరంగారెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జఫర్‌గడ్, సెప్టెంబరు 13 : మండలంలోని తిమ్మంపేటకు చెందిన మంద యాదగిరి (45) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో యాదగిరి జీవతంపై విరక్తి చెంది ఈనెల 11న గ్రామ చివర తన పొలం వద్ద పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. కుటుంబీకులు అతడిని అదే రోజు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యాదగిరి గురువారం రాత్రి చనిపోయినట్లు ఎస్ఐ రామ్‌చరణ్ తెలిపారు. మృతుడి భార్య కోమల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోనమ్మకుంటను పరిశీలించిన డీపీవో

పాలకుర్తి, సెప్టెంబరు 13 : వినాయకుల నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకునేందుకు శుక్రవారం మండల కేంద్రంలోని కోనమ్మకుంటను జనగామ జిల్లా పంచాయతీ అధికారి ఎన్. స్వరూప సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయకుల నిమజ్జనం ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు. ఆ సమయంలో ఎలాంటి ఘటనలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంపీడీవో రాములు, ఆర్ఐ రాకేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వాచారీ ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

పాలకుర్తి, సెప్టెంబరు 13 : రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావల్సిన పెండింగ్ డీఏలు ప్రకటించి పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం పురుద్ధరించాలని డీటీఎఫ్ జనగాం జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో ఆ సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు చిదురాల శ్రీనివాస్, ఎండి. శరీఫ్, అప్సర్, సూర్యప్రకాష్, ఎం. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డీజే ఆపరేటర్లకు సీఐ కౌన్సెలింగ్

దేవరుప్పుల, సెప్టెంబరు 13: మండలంలోని డీజే ఆపరేటర్లందరికీ శుక్రవారం దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని ర్యాలీల్లో ఎలాంటి డీజేలు పెట్టకూడదని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చ్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్టుల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 13: మండలంలోని తాటికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 140 మంది విద్యార్థులకు కెనరా బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ ముంద్రాతి నర్సింహా, పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వి.మురళి శుక్రవారం స్పోర్ట్స్ టీ-షర్టులను బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొడ రాజేందర్, ఉపాధ్యాయులు లింగమూర్తి, రంజిత్, జి.ప్రమోద్ రెడ్డి, పీడీ రుద్ర, అనసూయ, రవీందర్, వీరబ్రహ్మం, సలాఉద్దీన్, జగదీష్, సువర్ణ రాణి, రవి పాల్గొన్నారు.